
గురజాడ వీధి

# న్యాయం కోసం



## పి.వి.బి. శ్రీరామమూర్తి

“ఇంతకీ ఈ విషయంలో నీ ఉద్దేశ్యమేంటో?” అడిగాడు దినకర్.

“తక్షణం దీని గురించి మనం సీరియస్‌గా ఆలోచించాలి” అన్నాడు కిరణ్.

“అది సరే, దినమణిగారి స్పందనెలా ఉంది?”

“ఇది ఏ ఒక్కరివల్లా కావాల్సిన పనికాదు. ఈ వ్యవహారంలో పెద్దమనుషుల ప్రమేయం, ప్రచ్ఛన్న హస్తం ఉంది. అందుమండి దినమణిగార్ని అనలేం!” అన్నాడు కిరణ్.

“అలాంటి వ్యక్తులకే సాధ్యం కానపుడు, సామాన్యులేం సాధించగలరంటావ్?”

“సామాన్యులైతే ఇంతవరకూ రానే లేదు. ఇంత వరకూ వచ్చింది కాబట్టే వాళ్ళకు ఎప్పుడూ లేని తలనొప్పి, తలకు మించిన ఖర్చు అవుతోంది. పైగా వీళ్ళకి రూలింగ్ పార్టీ వాళ్ళు చుట్టాలయితే, అపోజిషన్ పార్టీ వాళ్ళు నేస్తాలు” అన్నాడు.

“ఇవాళ నల్లకోటు ధరించే వాళ్ళందరూ జేబులనిండా నల్లధనాన్ని నింపుకోటానికే చూస్తున్నారు తప్ప, ఈ కోటు దేనికోసం ధరిస్తున్నామో మరచిపోతున్నారు. ఇలా అందరం ఎవరికీ ఏం పట్టనట్టు ఊరుకుంటే లాభం లేదు. కనీసం మన ‘లా’ విద్యార్థులయినా నడుం బిగించి ముందుకొచ్చి ఎదిరించకపోతే, కొన్నాళ్ళకి ఈ దేశంలో ‘న్యాయం’ అన్న పదమే వినటం మర్చిపోతాం” అన్నాడు కిరణ్ చెలియలకట్ట దాటనున్న సముద్రంలాగా.

ఆ సాయంకాలం నగరంలో సుమారు పాతిక మంది న్యాయశాస్త్ర విద్యార్థులు న్యాయపోరాటం కోసం సమాయుత్తమయారు. వాళ్ళని తాకితే పౌరుషం షాక్ కొడుతుంది. ఒక్కొక్కరూ ఒక్కో బోసూ, ఒక్కో సీతారామరాజూ, ఒక్కో భగత్‌సింగ్‌ల్లా బుస్సుమన్నారు. వాళ్ళందరికీ ప్రముఖ న్యాయవాది దినమణి తాత్కాలిక సలహాదారు.

“దినమణిగారూ! మీరు ముందుకురండి. మేం ఎంతయినా ఖర్చుపెట్టడానికి సిద్ధం” అన్నారు యువ లా విద్యార్థులు.

“అది కాదు సార్! ఇంతకీ ఆ డాక్టరమ్మది హత్యా? ఆత్మహత్యా?” అన్నాడో విద్యార్థి.

“పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం ఆమెది ఆత్మ హత్యే!”

“అంటే?”

“బాహాటంగా కనిపించే నిజం మరోలా ఉంది. తెస్తానన్న కట్నం తేలేదని సినిమా ఫక్కీలో చంపబడినట్టు చుట్టు ప్రక్కల జనం కథనం ఈ డాక్టరమ్మా... ఆ డాక్టరూ రోజూ గొడవలు పడుతుండేవారట. మొదట్లో వీళ్ళిద్దరూ ప్రేమించుకున్న వాళ్ళే. కానీ పెద్దలు కట్నం కావాలన్నారు. డాక్టరమ్మ తలిదండ్రులు కట్నం ఇచ్చే ప్రశ్నేలేదన్నారు. ఎలాగో ఆడపిల్లవాళ్ళు కాబట్టి రాజీపడ్డారు. కొంత ఖర్చుల క్రింద ఇస్తామని ఒప్పుకున్నారు. ఈలోగా లక్షల కట్నం ఇచ్చే మరో డాక్టరమ్మ సంబంధం వచ్చింది. ఆమెకూడా చాలా అందగత్తె, అందువల్ల ఈ డాక్టరు ఆమెవైపు మొగ్గుచూపాడు. కానీ ఈ డాక్టరు రాసిన కొన్ని ఉత్తరాలూ, తీయించుకున్న ఫొటోలు... ఆ డాక్టరు రాసిన డైరీలు... అప్పట్లో ప్రేమతో ఆవిడ దగ్గరుంచినవి... వీటి ఆధారంతో ఆమె డాక్టర్ని తన సొంతం చేసుకుంది. అతని మనసుని తప్ప అందువల్ల పెళ్ళి అయినా... సాధింపులూ... వేధింపులూ ఫలితంగా ఆమె మరణం!”

“ఆవిణ్ణి బలవంతంగా పీక నులిమి చంపినట్లు ఆధారాలు కనిపిస్తోంటే ఆ డాక్టరు ఆత్మహత్యగా పోస్టుమార్టం రిపోర్టెలా ఇచ్చాడు? తోటి డాక్టరన్న సానుభూతయినా లేదా?”

“ఆ డాక్టరు మగాడు కదా! పైగా అగ్నికి గాలి స్నేహితునిలాగా– లాయరుకి డాక్టరెప్పుడూ సహకరిస్తూనే ఉంటాడు. ఈ దేశంలో డాక్టరు, న్యాయవాదీ చేతులు కలిపితే ఎలాంటి న్యాయాన్నయినా చంపగలరు. డాక్టరు రిపోర్టే వేదం. దాన్ని కాదనటానికి వీల్లేదు. డబ్బు కట్టలు దర్శనమిస్తోంటే సానుభూతి, చట్టుబండలూ ఎవరిక్కావాలీ నా బొంద?” అన్నారు దినమణి.

“సరే. ఈ విషయంలో మనం చేయాల్సిందేమి?”

“ఈ విషయంలో చేయగలిగిందేమిటి? పై కోర్టుకెళ్ళాలి. వెళ్తే.”

“అయితే డబ్బు పట్టుకుంటే పని అవుతుందా?”

“కొన్ని సాధించాలంటే డబ్బు అవసరమే. కాదనను. కాదనీ అనలేను. కానీ – అన్నీ డబ్బుతోనే సాధించలేం! దీనికి ప్రతిఘటన కావాలి! స్పందన కావాలి! చైతన్యం కావాలి! అందుకు విరుచుకుపడగలిగే యువశక్తి ముందుకు రావాలి!” అన్నారు.

“మేం మా ప్రాణాలనైనా అర్పిస్తాం” ఏకగ్రీవంగా

“ముందు మీరంతా ఒకటి కావాలి. ఒక యూనియన్ ఏర్పడాలి. దానికి నాయకులు కావాలి. ఒక ఎజెండా తయారు చేసుకోవాలి. అన్యాయం వైపు వాదించే లాయర్లని నిలదీయాలి. న్యాయానికి కొంత వరకైనా న్యాయం జరుగుతుంది. అప్పుడే మీలాటి యువకులు ముందుకొస్తేనే అది సిద్ధిస్తుంది” అన్నారు దినమణి.

సరే. మీరే దీనికి నాయకత్వం వహించాలి” అన్నాడు కిరణ్.

“నాయకత్వం సమస్య కారాదు. రేపందర్నీ సమీకరించండి. అప్పుడు చాలా విషయాలు చర్చించాలి!” అన్నారు ఆయన

ఆనాటికి ఆ సభ అలా ముగిసింది.

మర్నాడు దినమణిగారినేతృత్వంలో సభ జరిగింది. ‘దినమణి’ గారినే ‘న్యాయ పోరాట సమితి’కి ఛైర్మన్‌ని చేయాలనుకున్నారు ఎక్కువమంది యువకులు. కొందరు మాత్రం ఆయన్ని గౌరవ సలహాదారుగా ఉంచి కార్యవర్గాన్ని ఎన్నుకోవాలన్నారు. సరేనన్నారు దినమణిగారు. అందులోనూ ఘటికుడూ, గొప్ప చురుకైనవాడూ మార్కండేయులు. వాక్పటిమ, సమయస్ఫూర్తికలవాడు. అతన్ని ఛైర్మన్ చేస్తే బాగుంటుందన్నారు అందరూ. ఇంచుమించు అతని పేరు ఖరారౌతుందన్న దశలో సూర్యారావు చిన్న సందేహం లేవనెత్తాడు. ‘మార్కండేయులు ఫైనలియర్ విద్యార్థి. రేపో, నేడో ఎగ్జామ్స్ రాస్తే నల్లకోటు తొడుగుతాడు. వాళ్ళూరూపోతాడు. అందునుంచి కొన్నాళ్ళుండి పనిచేసే మనిషిని ఎన్నుకోవటం మంచిది’ అన్నాడు సూర్యారావు. కొంతసేపు తర్జన భర్జనల అనంతరం మార్కండేయుల పేరు వెనక్కెళ్ళిపోయింది.

“డేవిడ్ రాజు అయితే బాగుంటుంది” అన్నాడు మార్కండేయులు.

“డేవిడ్ రాజుకంటే శర్మ అయితే బాగుంటుంది” మరొకరు.

“శర్మ మెతక. ఇబ్రహీం చురుకైనవాడు” ఓ




ముస్లింల కుర్రాడు.

సూర్యారావు భగ్గుమన్నాడు. "అయితే శర్మా... లేపోతే డేవిడ్... కాపోతే ఇబ్రహీం! వీళ్ళేనా కనిపిస్తున్నారు. ఒంటరి తాటి చెట్లలాగా కులాని కొకడూ. మతానికొకడూ అయితే సరిపోతుందా! సమాజంలో మనం జనంలోకెళ్ళి నిలబడాలంటే వీళ్ళకున్న బలమెంత? వీళ్ళ వర్గమెంత? దాని గురించి ఆలోచించరేం? ఒక పని చేయాలంటే ప్రజ్ఞ ఒక్కటే చాలదు. రాజ్యాంగం రాసిన అంబేద్కర్ ప్రధాని ఎందుక్కాలేకపోయాడో ఆలోచించండి!" అన్నాడు సీరియస్‌గా.

అతని మాట దినమణిగారికి అర్థం అయింది.

అతనికి పరిస్థితీ అర్థమయింది.

"పోనీ సూర్రావుని ప్రపోజ్ చేస్తే?" అన్నారు దినమణి.

"గురూగారు! నామీదంతా భారం పెట్టకండి. నాకా కాంక్షలేదు" అనేసి, కొద్ది నిమిషాలు అందరూ ఊరుకోగా" మీరు తప్పదంటే ఎవరూ ముందుకు రాకపోతే నాకభ్యంతరం లేదు" అన్నాడు ముసిముసిగా.

శర్మకి ఒళ్ళు మండింది.

"రవి అయితే ఇంకా సమర్థుడు ఆరడుగుల మనిషి. ప్రకాశం పంతులుగారిలా బోర విరచుకుని జనంలోకి వెళ్ళగలడు. కులం బలంకూడా ఉంది" అన్నాడు.

సూర్యారావు కస్సుమన్నాడు.

సూర్యారావుకీ, రవికీ పోటీ అనివార్యమయింది.

ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి.

ఎన్నికలు తేదీ దగ్గరపడ్డ కొలదీ రవి బలం వుంజుకోసాగింది. సూర్యారావుకి చెమటలెక్కాయి. కొంతమందిని ఒరిస్సా పంపించాడు. సరుకు తెప్పించాడు, బొంబాయి పంపించి చవకరకం సినీ అందగత్తెలను తెప్పించాడు ఇంటినిండి దండిగా సొమ్ము తెప్పించాడు, పసందైన విందు ఇచ్చాడు.

అయినా రవి గెలిచి తీరుతాడనుకున్నారు అందరూ,

కానీ–

డాక్టరమ్మలాంటి దురదృష్టవంతు(రాళ్ళ)లకూ, మధ్య తరగతి మగువలకూ, బలహీనులకూ, బడుగు వర్గాలకూ దూరమైపోతోన్న న్యాయం కోసం ఏర్పాటు చేయదలచిన న్యాయ పోరాట సమితి ఛైర్మన్ ఎన్నికలలో సూర్యారావు గెలిచాడు!

కులం గెలిచిందా? ధనం గెలిచిందా అని ఆలోచించటం అనవసం. సూర్యారావు గెలిచాడు. న్యాయం గట్టిగా కళ్ళు మూసుకుంది. నోరూ, చెవులూ మూసుకుంది. ముమ్మాటికీ అంతే! ◆